
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

గురువారం 17 ఏప్రిల్ 2025

ఉద్యోగ సృష్టికర్తలుగా

ఎదగాలి

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- కేఎస్‌పీపీలో పట్టాల ప్రదానోత్సవం 7

సిద్దిపేటలో అతిపెద్ద

జైన విగ్రహం

- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి
- అరుదైన ప్రతిమను కాపాడుకోవాలని పిలుపు 7

హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన

నిరసన దీక్షలో నిర్మలాజగ్గారెడ్డి

కాంగ్రెస్ నేతలపై అక్రమ కేసులు పెడితే ఖబడ్దార్





సీనియర్ కాంగ్రెస్ నేత వీహెచ్‌తో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై కేంద్ర ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరసన దీక్షలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత వీహెచ్ హనుమంతరావుతో కలిసి నిర్మలాజగ్గారెడ్డి ఈడీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఈ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, లేదంటే దేశ వ్యాప్తంగా నిరసన చేపడుతామని హెచ్చరించారు.

బిడ్డకు జన్మనివ్వడం

తల్లికి పునర్జన్మ వంటిది

- అదనపు కలెక్టర్ కలెక్టర్ గరీమా అగ్రవాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

రాయపోల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బిడ్డకు జన్మనివ్వడం ప్రతీ తల్లికి పునర్జన్మ లాంటిదని, గర్భిణులు విధిగా పోషకాహారాలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. బుధవారం రాయపోల్‌లో జరిగిన పోషణ పక్షోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు ముఖ్యంగా డ్రైఫ్రూట్స్‌తో పాటు పోషకాలు కలిగిన ఆహారాన్ని విధిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బాబూనాయక్, ఎంపీడీవో బాలయ్య, సీడీపీఓ సరిత, ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ రఘుపతి, సూపర్‌వైజర్లు అనురాధ, షబానా పాల్గొన్నారు.

అవసరమయ్యే ఇసుకను అందించాలి

గజ్వేల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవసరమయ్యే ఇసుకను అందించాలని గజ్వేల్ ఆర్డీవోకు అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. గజ్వేల్ మండలం గిరిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని బుధవారం ఆమె పరిశీలించి, పనుల ప్రగతి, పనుల పురోగతిని గూర్చి అడిగి తెలుసుకుని, లబ్ధిదారులతో మాట్లాడారు. వారి వెంట గజ్వేల్ ఆర్డీవో వీఏల్ చంద్రకళ, హౌజింగ్ పీడీ దామోదర్ రావు, ఎంపీడీవో ఆరే ప్రవీణ్, ఎంపీవో దయాకర్, పంచాయతీ కార్యదర్శి అజారుద్దీన్, పంచాయతీరాజ్ డీఈ, ఏఈ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.



అంబేడ్కర్ భవన్ ఆవరణలో నత్తనడకన కొనసాగుతున్న ట్యాంకు నిర్మాణ పనులు

అమృత్ 2.0

ఇక జీరోయేనా!

- రెండేళ్లక్రితం రూ.13.50కోట్లు మంజూరు
- వాటర్ ట్యాంక్‌లకు స్థలం కరువు
- అంబేడ్కర్ భవన్, ఆర్టీసీ, మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్మాణానికి ప్రతిపాదన
- స్థలం బదలాయింపులో ఆర్టీసీ, మార్కెటింగ్ శాఖల కినుక
- పట్టించుకునేనాథుడు కరువు

చేర్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : "దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదు" అన్న సామెత చందంగా ఉంది చేర్యాల మున్సిపాలిటీ పరిస్థితి. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ వహించి చేర్యాల మున్సిపాలిటీకి అమృత్ 2.0 పథకం ద్వారా చర్యలు తీసుకున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంతో అతీగతీ లేకుండాపోయింది. ప్రత్యామ్నాయ పనులకు సంబంధించి కోట్లాది రూపాయలు మంజూరు చేసి ఏడాదిన్నర గడిచినా కార్యరూపం దాల్చక నిష్ప్రయోజనంగా మారాయి. మరిన్ని రోజులు ఆలస్యమైతే నిధులు వెనక్కి మళ్లిపోనున్నాయన్న ప్రచారం సాగుతుండడంతో ప్రజలు ఆయా వర్గాల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.

చేర్యాలలోని 12 వార్డుల్లో 20వేలకు పైగా జనాభా, 6వేల ఇళ్లు, 4,600 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. నిత్యం నీటి సరఫరాకు మిషన్ భగీరథతో పాటు 131 పవర్‌బోర్లు, 21 వాటర్ ట్యాంకులు వినియోగిస్తున్నారు. ఒక్కో ఇంటికి 135 ఎల్‌పీసీడీ (లీటర్ పర్ కెపాసిటీ డైలీ) డిమాండ్ ఉండగా, ప్రస్తుతం 70 ఎల్‌పీసీడీ నీటిని మాత్రమే అందిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. పట్టణ ప్రజలకు 2.75 ఎంఎల్‌డీ నీరు అవసరమవుతాయి. అందులో మిషన్ భగీరథ ద్వారా 1.75 ఎంఎల్‌డీ సామర్థ్యం నీరు అందిస్తుండగా, మిగతా 1.ఎంఎల్‌డీ నీరు 131పవర్ బోర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. దీంతో సగానికిపైగా రక్షితనీరు అందకపోవడంతో పాటు పలు ప్రదేశాలలో భవిష్యత్ అవసరాలకు సరిపడా ట్యాంక్‌లు, పలు వీధులలో నల్లా కనెక్షన్లు లేకపోవడం, పలు ఏరియాల్లో రెండురోజులకోసారి నీటిసరఫరా చేస్తుండటంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మేరకు మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్న నేపథ్యంలో కేంద్రం అమృత్ 2.0పథకం ద్వారా చేర్యాల మునిసిపాలిటీకి సుమారు రెండు సంవత్సరాలకిత్రం రూ.13.50కోట్లు నిధులు మంజూరు చేసింది. టెండర్లు ప్రక్రియపూర్తి చేయగా, మెగా ఇంజనీరింగ్ సంస్థ కాంట్రాక్టు కైవసం చేసుకుంది.

3 ప్రదేశాల్లో 3 ట్యాంకుల నిర్మాణానికి చర్యలు

నిధులు మంజూరుకావడంతో కొన్నాళ్లక్రితం సంబంధిత అధికారులు, మున్సిపల్ అధికారులు కలిసి ఏయే ప్రాంతాల్లో నీటి సమస్య ఉంది. ఎక్కడ వాటర్ ట్యాంకుల నిర్మాణం అవసరం ఉంది. ఎక్కడ పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలనే దానిపై సమీక్షించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద 1000 కేఎల్, మార్కెట్ యార్డు వద్ద 500కేఎల్, అంబేడ్కర్‌భవన్ ఏరియాలో 500కేఎల్ సామర్థ్యంతో మూడు నూతన వాటర్ ట్యాంకులు, అలాగే గ్రావిటీ పైప్‌లైన్ 7.80 కిలోమీటర్లు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ 8.30 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.

స్థలం బదలాయింపులో మోకాలడ్డు

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో 500కేఎల్, మార్కెట్‌యార్డు ఆవరణలో 500కేఎల్ సామర్థ్యంతో చేపట్టనున్న ట్యాంకుల నిర్మాణానికి స్థలం కేటాయించాలంటూ మునిసిపల్ అధికారులు ఆయా శాఖల అధికారులను కోరుతూ లేఖలు రాశారు. బస్టాండు, మార్కెట్‌యార్డు ఆవరణలో ఆశించిన మేర ఖాళీస్థలం ఉన్నప్పటికీ బదలాయింపులో మోకాలడ్డుతుండటంతో ట్యాంక్‌ల నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మార్కెట్‌యార్డులో ఇప్పటికే మిషన్ భగీరథ ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ ఉండగా, ప్రస్తుతం చేపట్టబోయే ట్యాంక్‌కు స్థలం ఇవ్వకపోవడం, అలాగే ఆర్టీసీ బస్టాండు ఆవరణ చాన్నాళ్లుగా ఖాళీగా ఉండటం, మట్టికుప్పలు పిచ్చి మొక్కలమయంతో ఉన్నప్పటికీ ట్యాంక్ నిర్మాణానికి కేటాయించకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో ఎక్కడా కూడా నీటి పైప్‌లైన్ నల్లా కనెక్షన్ లేని ప్రదేశంతో భవిష్యత్తులో పట్టణం విస్తరించినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని పైప్‌లైన్ లెవల్ ఆధారంగా ఆయా ప్రదేశాలను ఎంపికచేసినప్పటికీ కినుక వహిస్తుండటంతో ఆశలు చాలించుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. స్థలం బదలాయింపునకు సంబంధించి ప్రత్యామ్నాయ చర్యలను వేగవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ వహించకపోవడంతో భవిష్యత్తులో తాగునీటి ఇక్కట్లు తలెత్తనున్నాయి.

అంబేడ్కర్ భవన్ వద్ద నత్తనడకన

మునిసిపాలిటీ పరిధిలో స్థలం అందుబాటులో ఉన్న అంబేడ్కర్ భవన్ ఆవరణలో 500 కేఎల్ సామర్థ్యంతో ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

మిగతా 8వ పేజీలో..

యువ వికాసం

- ఈనెల 14తో ముగిసిన ఆన్‌లైన్ గడువు
- రాజీవ్ యువ వికాస పథకానికి వెల్లువెత్తిన దరఖాస్తులు

- జిల్లా వ్యాప్తంగా 56,795 దరఖాస్తులు
- బుధవారం నాటికి స్వీకరించిన దరఖాస్తులు 30,785
- నిర్ణీత గడువుకు ముందు మూడు రోజులు మొరాయించిన సర్వర్లు
- కలెక్టర్ నేతృత్వంలో ఎంపిక కమిటీలు
- మే 31 వరకు దరఖాస్తులను పరిశీలించనున్న అధికారులు
- జూన్ 2న లబ్ధిదారులకు అందనున్న రుణ మంజూరు పత్రాలు



సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 16: నిరుద్యోగ యువతీయువకులు స్వయం ఉపాధి పథకం కింద ఆర్థికంగా రాణించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. మార్చి 17న ప్రారంభమైన ఆన్‌లైన్ ప్రక్రియ తొలుత ఏప్రిల్ 5న చివరి తేదీ గడువును విధించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు కుల, ఆదాయ ధ్రువ పత్రాలను తహసీల్దార్ నుంచి ఇటీవల కాలంలో జారీచేసినవి కావాలనడంతో అనేక మంది దరఖాస్తు చేసుకోగా సర్వర్ అనేక చోట్ల మొరాయించింది. దీంతో యువ వికాసానికి గడువు పెంచాలని పలువురు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా ఈ నెల 14 వరకు గడువు పెంచారు. ఆ రోజు వరకు మొత్తం 56,795 దరఖాస్తులు వచ్చాయి. పలు కులాల వారీగా వాటిని విభజించారు. ఆన్‌లైన్ ద్వారా చేసుకున్న దరఖాస్తులను ఈ నెల 20 వరకు గడువు ఉండడంతో స్థానిక మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తులను అందిస్తున్నారు.

క్ర.స	కులం	దరఖాస్తులు	స్వీకరించినవి
1.	బీసీ	36,225	19,299
2.	ఎస్సీ	13,298	7,870
3.	ఎస్టీ	2,010	1,164
4.	ముస్లిం మైనార్టీ	3,331	1,670
5.	క్రిస్టియన్ మైనార్టీ	57	20
6.	ఈబీసీ/ ఈడబ్ల్యుఎస్	1874	762
	మొత్తం	56,795	30,785

జిల్లా వ్యాప్తంగా 56,795 దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకానికి సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 56,795 దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో సిద్దిపేట మున్సిపల్ పరిధిలో 6,695 దరఖాస్తులు రాగా అత్యల్పంగా చేర్యాల మున్సిపల్‌లో 305 దరఖాస్తులు వచ్చాయి. 56,975 దరఖాస్తులకు గానూ బుధవారం నాటికి దరఖాస్తుదారులు ఆన్‌లైన్ చేసినటువంటి ఫారాలను దాదాపు 30,785 దరఖాస్తులను మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేశారు.

కులాల వారీగా యూనిట్లు కేటాయింపు

సిద్దిపేట జిల్లా జనాభా ప్రాతిపదికన కులాల వారీగా రాజీవ్ యువ వికాసానికి పలు యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. పథకంలో రూ.50వేలు, రూ.లక్ష, రూ. 2లక్షల నుంచి 4 లక్షలు రుణాలు అందిస్తుండగా, రూ.50 వేలకు 100 శాతం సబ్సిడీ రాయితీ, రూ. 50వేల నుంచి రూ. లక్ష వరకు 90 శాతం సబ్సిడీ రాయితీ కాగా, 10 శాతం మాత్రమే తిరిగి బ్యాంకుకు చెల్లించేలా, రూ. లక్ష నుంచి రూ.2లక్షల వరకు 80 శాతం సబ్సిడీ రాయితీ, 20 శాతం బ్యాంకు నుంచి రుణం, రూ. 2 లక్షల నుంచి 4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీ రాయితీ, 30 శాతం బ్యాంకు నుంచి రుణం అందిచనున్నారు. పథకంలో ఆర్థికంగా నిలబడేందుకు పౌల్ట్రీ, బ్యాగుల తయారీ, కొబ్బరి బోండాల దుకాణం, బ్యాంగిల్ స్టోర్, డెయిరీ ఫాం, ఎలక్ట్రికల్, మిని సూపర్ బజార్, స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్, గొర్రెలు, సెలూన్, బ్యూటీపార్లర్, హార్డ్‌వేర్, మెడికల్ దుకాణాలు ఇలా ఎస్సీ 117, ఎస్టీలకు 82, బీసీ, ఈబీసీ 193, ఎంబీసీ 195, మైనార్టీ 158, క్రిస్టియన్లు 169 స్కీం యూనిట్లు అందించనున్నారు.

కలెక్టర్ నేతృత్వంలో

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 20 తరువాత మే 31 వరకు అర్హులెవరో

మిగతా 8వ పేజీలో..

ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం

- గౌరవెల్లి ప్రాజెక్టుతో ఈ ప్రాంతం సస్యశ్యామలం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

అక్కన్నపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వడగళ్ల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం అందజేస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. బుధవారం అక్కన్నపేట మండలం పంతులుతండా, అక్కన్నపేట, అంతకపేట గ్రామాల్లో ఇటీవల కురిసిన వడగళ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలు, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతుల వివరాలు ప్రభుత్వానికి అందించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. పంట నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఉత్తర తెలంగాణలో వడగళ్ల వర్షాలకు దెబ్బతిన్న వరి, మక్క, కూరగాయల పంటలు, మామిడి తోటలను వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం సర్వే చేస్తున్నారని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టు నీళ్లు వస్తే ఈ ప్రాంతం పూర్తిగా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. రైతులు కూరగాయల పంటలు కూడా ఎక్కువగా సాగు చేయాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందని, కూరగాయల పెంపకానికి ప్రోత్సాహం కల్పిస్తామని స్పష్టం చేశారు. హన్మకొండ, సిద్దిపేట, జనగాం, కరీంనగర్ పట్టణాలు పక్కనే ఉన్నాయని, రైతులు కూరగాయల సాగుతో మరింత అభివృద్ధి చెందొచ్చని సూచించారు. భవిష్యత్తులో హుస్నాబాద్ నియోజకవర్గంలో వ్యవసాయపరంగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, అధికారులు ఉన్నారు.



వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న మంత్రి ప్రభాకర్

'ఆంధ్రజ్యోతి' విజేతలకు బహుమతులు



మూడో బహుమతి విజేతగా నిలిచిన ఎం.చెన్నయ్యకు 32 ఇంచుల టీవీ అందచేస్తున్న డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ రవి



రెండో బహుమతి విజేతగా నిలిచిన గాదిరాజ్ రవిచంద్రకు ఫ్రిజ్ అందజేస్తున్న డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ రవి

'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా కార్ అండ్ బైక్ రేస్ హైదరాబాద్ యూనిట్ డ్రాలో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. రెండో బహుమతి విజేతగా నిలిచిన గాదిరాజు సువర్ణ లక్ష్మి తరపున ఆమె కుమారుడు గాదిరాజ్ రవిచంద్రకు ఫ్రిజ్ (రిఫ్రిజిరేటర్), మూడో బహుమతి విజేతగా నిలిచిన ఎం.చెన్నయ్యకు 32 ఇంచుల టీవీని 'ఆంధ్రజ్యోతి' తరపున డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ రవి అందజేశారు.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి)

త్వరలోనే క్యాటరాక్ట్ సర్జరీలు

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విమలథామస్, డీఎంఅండ్‌హెచ్‌వో పల్వన్‌కుమార్



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విమలథామస్, డీఎంఅండ్ హెచ్‌వో పల్వన్‌కుమార్

సిద్దిపేట, ఏప్రిల్ 16: త్వరలోనే సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాల(జీజీహెచ్)లో ప్రతిరోజూ కనీసం 20 మందికి కళ్లకు సంబంధించిన క్యాటరాక్ట్ సర్జరీలు నిర్వహించాలన్నది తమ లక్ష్యమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విమలథామస్, డీఎంఅండ్‌హెచ్‌వో పల్వన్‌కుమార్ తెలిపారు. బుధవారం సిద్దిపేటలోని జీజీహెచ్ ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. డివిజన్ వారీగా క్యాటరాక్ట్ చికిత్సకు స్క్రీనింగ్ చేపట్టాలని, అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించే విధానాలు అమలులోకి తేవాలని, అందుకు క్షేత్రస్థాయి ఆశాకార్యకర్తల దగ్గర నుంచి వైద్యసిబ్బంది వరకు పనిచేయాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ శాంతి, డాక్టర్ ఆనంద్, డాక్టర్ రేవతి, డాక్టర్ శ్రీనివాస్, ఏవో నవీన్‌రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రభవన్ హోటల్ వద్ద రాత్రి బైక్(టీఎస్35టీ1943)ను ఇద్దరు దొంగలు ఎత్తుకెళ్లారు. సీసీ ఫుటేజ్ ద్వారా నిందితుల దృశ్యాలు నమోదు కావడంతో వారి ఆచూకీ కోసం పట్టణ పోలీసుల దొంగల ఫోటోలను విడుదల చేశారు. బైక్ దొంగలించిన వ్యక్తుల గురించి తెలిస్తే.. 8712657913, 8712657878 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ నాగరాజు సూచించారు.



బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోచయ్య మృతి

● ఎమ్మెల్యే రోహిత్‌రావు సంతాపం


రొయ్యల పోచయ్య(ఫైల్)

రామయంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రొయ్యల పోచయ్య(70) కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధ పడుతూ బుధవారం ఇంట్లోనే మరణించారు. నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో ఎన్నో పదవులు పొందిన ఆయన నిస్వార్థంగా పనిచేశారు. మొదట్లో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, తరువాత మండల యూత్ అధ్యక్షుడిగా, వార్డు సభ్యుడిగా, పీఏసీఎస్ ఛైర్మన్‌గా కొనసాగారు. పదేళ్లుగా బ్లాక్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. పోచయ్య మృతిపై మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కోటి యుగంధర్ సంతాపం ప్రకటించి.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

గుండెపోటుతో పీఏసీఎస్ ఛైర్మన్ కన్నుమూత


కృపాకర్‌రెడ్డి (ఫైల్)

కొల్చారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కొంగోడు గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ కృపాకర్‌రెడ్డి(47) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్‌లో పని చేస్తున్నారు. కొన్ని రోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మృతికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, వేమారెడ్డి, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కోహెడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన పొన్నాల నర్సయ్య(49) ఇంటి నిర్మాణానికి వినియోగించే సెంట్రింగ్ కర్రలు కిరాయికిస్తూ, మేస్త్రి పని చేసుకుంటూ కుటుబాన్ని పోషిస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా కర్రలకు సరిగా గిరాకీ లేకపోవడంతో అమ్ముకున్నాడు. మేస్త్రీ పని సైతం దొరకకపోవడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా కుటుంబ సభ్యులు కాపాడి అప్పులు ఎలాగైనా తీర్చుకుందామని ఓదార్చారు. అయినప్పటికీ తీవ్ర మానసిక ఆందోళనతో నర్సయ్య ఈ నెల 14న చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో చేసిన పనికి డబ్బులు వసూలు చేయడానికి వెళ్తున్నాని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. బస్వాపూర్ గ్రామంలో గుండె కనకయ్య వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు బుధవారం గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి ఉన్నందున ఇంటి నుంచి వెళ్లిన రోజే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎలక్ట్రికల్ వైర్ చోరీ ముఠా అరెస్ట్

● రూ.2.2లక్షల విలువైన సామగ్రి స్వాధీనం
● వివరాలు వెల్లడించిన సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడి

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం, గంజాయి వంటి చెడు అలవాట్లకు బానిసై ప్రైవేట్ వెంచర్లలో కరెంట్ వైర్ల దొంగతనాలకు పాల్పడే ముఠా గుట్టును జిల్లా పోలీసులు రట్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.2.2లక్షల విలువైన అల్యూమినియం ఎలక్ట్రికల్ వైరు, ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రం దమర్‌పూర్‌కు చెందిన ముఖేష్ పరిదా(27), రవిరంజన్ కుమార్(21), దినేష్ కుమార్‌సహని(20), మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లికి చెందిన సాగర్ పవార్(25), బీహార్‌లోని చాప్రాకు చెందన రంజయ్ కుమార్ రామ్(20), ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం బల్లియా జిల్లా, దరియాపూర్ థానేకు చెందిన అమిత్‌పాండే (30), బీహార్ రాష్ట్రం అఖిల్‌పూర్‌కు చెందిన వినయ్‌కుమార్ రామ్ (18), హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన శైలేష్(25), రవిశంకర్ సింగ్ (47)లతో పాటు మరో నలుగురు నిందితులు ఒక ముఠాగా ఏర్పడి గత కొన్ని సంవత్సరాలుగా సుభాష్‌నగర్, జీడిమెట్ల, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరికి మద్యం, గంజాయి సేవించడం వంటి అలవాట్లున్నాయి. జల్సాలకు డబ్బు సరిపోక దొంగతనాలకు పాల్పడటం మొదలుపెట్టారు. ఒడిస్సాకు చెందిన హరి, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌తో కలిసి కరెంట్ సరఫరా లేని వెంచర్లలో స్తంభాలకు ఉన్న అల్యూమినియం ఎలక్ట్రిక్ వైర్లను దొంగతనం చేసి స్క్రాప్ షాప్‌లలో విక్రయించేవారు. ఇలా సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట మండలం అంకెనపల్లిలో ఉన్న ఓ వెంచర్‌లో, నందకంది, ఆత్మకూర్ గ్రామ శివార్లలో, హత్నూర, ఇంద్రకరణ్, జిన్నారం, సంగారెడ్డి రూరల్ తదితర శివారులలో ఉన్న వెంచర్లలో అల్యూమినియం వైర్లను దొంగిలించారు. ఈ మేరకు జిల్లా ప్రత్యేక పోలీసు బృందాలు, సీసీఎస్ పోలీసులు బుధవారం సదాశివపేట మండలం మద్దికుంట చౌరస్తాలో 13 మంది ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.2లక్షల విలువైన 778 కిలోల అల్యూమినియం ఎలక్ట్రికల్ వైరు, ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ కసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.శివకుమార్, రాము నాయుడు తదితర సిబ్బందిని జిల్లా ఎస్పీ పంకజ్ అభినందించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


కంట్రోత్ పోమ్లా(ఫైల్

టేక్మాల్ ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మోటర్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మణ్‌తండాకు చెందిన కంట్రోత్ పోమ్లా(55) మంగళవారం రాత్రి జోగిపేట- కొత్తపల్లి ప్రధాన రహదారిపై ఉన్న వడ్ల కుప్పల వద్ద ఉన్నాడు. అదే సమయంలో ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి అతడిని బలంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన పోమ్లాను చికిత్స నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు..


భాను(ఫైల్)

అక్కన్నపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇసుక తీసుకువస్తున్న ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామానికి చెందిన లింగాల భాను(23) నంగునూరు మండలం ఖాతా వాగు నుంచి గ్రామానికి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నాడు. అప్పటికే నాలుగు ట్రిప్పులు తరలించి, మరో ట్రిప్పు ఇసుకను తీసుకవస్తుండగా ప్రమాదవశాత్తు గ్రామ శివారులో కల్వర్టులో ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయిన భాను మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడి చేరుకుని జేసీబీ సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సోషల్ మీడియాలో ఫేక్ ఫోటోలు

● ఇద్దరు నిందితుల అరెస్ట్


పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఫేక్ ఫోటోలు పెట్టిన ఇద్దరు నిందితులను సంగారెడ్డి రూరల్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లగూడెంకు చెందిన అరుణ్ యాదవ్, కొండాపూర్ మండలం ఉత్తర్‌పల్లికి చెందిన లల్లూ యాదవ్‌లు ప్రముఖుల ఫోటోలు క్రియేట్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో వివిధ సంఘాల నాయకులు సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఫేక్ ఫోటోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆయా సంఘాలు ఆందోళన విరమించాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

అంబేడ్కర్ ఫొటోను మార్ఫింగ్ చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

జోగిపేట రూరల్, ఎప్రిల్16(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ ఫొటోను కొంతమంది దుండగులు మార్ఫింగ్ చేసి కించపరచడంపై దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. వారిపై చట్టరీత్యా చర్యలు తిసుకోవాలని అందోల్ మండల దళిత సంఘాల నాయకులు ఎస్ఐ పాండుకు వినతి పత్రాన్ని అందజేశారు.

బురద రోడ్డులో పడి పలువురికి గాయాలు


బురద రోడ్డులో జారీ పడిపోయిన ద్విచక్ర వాహనాలు వాహనాలు


కోహీర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన కోహీర్‌లోని రైల్వే లైన్‌కు పక్కన గల పొలాలకు వెళ్లే దారిలో పడి పలువురికి గాయాలయ్యాయి. కోహీర్ సమీపంలోని 24వ రైల్వే గేటు వద్ద గత 13వ తేదీన రైల్వే ట్రాక్ మరమ్మత్తులు కొనసాగుతున్నాయి. దీంతో రైల్వే గేట్‌ను మూసివేయడంతో ప్రత్యామ్నాయ మార్గంమైన రైల్వే లైన్ పక్కన ఉన్న పొలాలకు వెళ్లే దారిని గుండా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. అయితే బుధవారం మూడున్నర గంటల సమయంలో కోహీర్‌లో భారీగా వర్షం కురవడంతో పొలాలకు వెళ్లి ఆ దారి పూర్తిగా బురదమయం కావడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడిపోయాయి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న మహిళలు చిన్న పిల్లలు ద్విచక్ర వాహనాలపై నుంచి జారిపడిపోయి గాయాలపాలయ్యారు. రైల్వే ట్రక్ మరమ్మత్తు పనులు పూర్తయింతవరకు తాత్కాలికమైన రోడ్డును పకడ్బందీగా ఏర్పాటు చేసి ఉంటే ఇలా జరిగేది కాదని పలువురు పేర్కొన్నారు.

మామిడి చెట్టు వద్ద మూడు ముక్కలాట


శివ్వంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బుధవారం ఓ మామిడి చెట్టు వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని చండీ గ్రామంలో ఆలయ సమీపంలో ఓ మామిడి చెట్టు వద్ద మూడు ముక్కలాడుతున్నారనే సమాచారంతో దాడి చేసి 1620 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న శివన్న గారి శివుడు, గడ్డమీది శ్రీశైలం, సంధి గాని నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ చేపట్టవచ్చని పెద్దశంకరంపేట అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్‌వో శ్రీశైలం అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి పాఠశాలల్లో పబ్లిక్ ప్రాంతాల్లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పేట అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఎల్ఎఫ్ ధర్మ, డీవోపీ బంగారయ్య, ఎఫ్ఎం రాజశేఖర్, సాయికిరణ్, రమేష్, పేట వైద్యాధికారి షర్ఫోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.













సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు తయారు చేసిన స్మార్ట్ సిటీ నమునా



బ్యాటరీతో నడిచే రేసింగ్ కారును ప్రదర్శిస్తున్న మెకానికల్ విద్యార్థులు

ఉత్సాహంగా టెక్నో ఫెస్ట్

● ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు

పుల్‌కల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో 13వ టెక్నో 2కె25 ఫెస్ట్ కొనసాగుతున్నది. బుధవారం కళాశాలలోని సీఎస్ఎస్సీ, ఈసీఈ, సివిల్, మెకానికల్ విభాగాలకు సంబంధించి టెక్నికల్, నాన్ టెక్నికల్ ప్రాజెక్టుల ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. ఎలాంటి ఖర్చు లేకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడేలా బ్యాంబో బ్రిడ్జి (వెదురు కర్రల వంతెన), నీటి శుద్ధి కేంద్రం, స్మార్ట్ సిటీ, భూకంపాలను తట్టుకునేందుకు వీలుగా ఎర్త్ క్విక్ రెసిస్టెంట్ బిల్డింగ్ వంటి నూమూనాలను ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. ఆటపాటలు, గీటారు వాయించడం, తరగతి గదులను అందంగా అలంకరించడం వంటి కార్యక్రమాలతో ఫెస్ట్ ఉల్లాసంగా సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ జి.నర్సింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, ప్రొఫెసర్లు రజనేష్, జోషీ, విజయ్‌కుమార్ ప్రాజెక్టులను పర్యవేక్షించారు. గురువారం రాత్రి జరిగే ఫెస్ట్ ముగింపు ఉత్సవాలకు హైదరాబాద్ కూకట్‌పల్లి జేఎన్టీయూ వైస్ చాన్సలర్ కిషన్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.



రేయిన్ వాటర్ హర్వెస్టింగ్ విధానాన్ని వివరిస్తున్న విద్యార్థులు

అధికారుల నిర్లక్ష్యం.. ఇదిగో సాక్ష్యం

● సర్టిఫికెట్ జారీలో తీవ్ర జాప్యం ● కంటతడి పెట్టిన బాలిక

కోహీర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సర్వర్ పని చేసినప్పుడు కరెంటు ఉండదు.. కరెంట్ ఉంటే సర్వర్ పనిచేయదు.. ఈ రెండూ ఉంటే అధికారులు ఉండరు.. ఇది కోహీర్ తహసీల్దార్ కార్యాలయ దుస్థితి. ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా వివిధ ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ముఖ్యంగా డెత్, బర్త్ సర్టిఫికెట్లు, ఆర్డీవో ప్రొసీడింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బుధవారం ఓ బాలిక ధ్రువపత్రాల కోసం వచ్చి కంటతడి పెట్టడమే ఇందుకు నిదర్శనం. కోహీర్ మండలంలోని పీచేర్యాగడి గ్రామానికి చెందిన బాలిక గోపిక తన తండ్రి, మేనమామల మరణ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవాలో దరఖాస్తు చేసి చేసి రెండు వారాల క్రితం కోహీర్ తాహసీల్దార్ కార్యాలయంలో ఫైల్ అప్పగించింది. అప్పటినుంచి రేపిస్తాం.. ఎల్లుండిస్తామంటూ అధికారులు కాలయాపన చేస్తూ కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. బుధవారం కూడా ఎండకు ఆపసోపాలు పడుతూ కార్యాలయానికి చేరుకున్న బాలికకు సర్టిఫికెట్లు జారీ చేయకపోవడంతో కన్నీరు పెట్టింది. తన బాధను వినేవారే లేరని బోరున విలపించింది. ఇప్పటికైనా అధికారుల పనితీరులో మార్పు వచ్చేలా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని పలువురు కోరారు.



తహసీల్దార్ కార్యాలయంలో కన్నీరు పెడుతున్న బాలిక

బస్సు వచ్చేదాకా ఎండలోనే..

● బస్ షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్న ఏడుపాయల భక్తులు



ఏడుపాయలకు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి పక్కన మండుటెండల్లో బస్సు కోసం ఎదురుచూస్తున్న భక్తులు

కొల్చారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయలకు నిత్యం వేలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి శివారులోని ప్రధాన రహదారి నుంచి సుమారు కిలోమీటర్నర దూరంలో ఆలయం ఉంటుంది. బస్సుల్లో వచ్చే భక్తులు ఇక్కడే దిగి ఆలయానికి వెళ్లడం, తిరుగుప్రయాణంలోనూ ఇక్కడే బస్సు ఎక్కి వెళ్తుంటారు. సంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ దారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ రహదారి వద్ద కనీసం బస్ షెల్టర్ లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు వచ్చేదాకా మండుటెండల్లోనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొన్నది. భక్తుల సౌకర్యార్థం ఇక్కడ బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను పలువుమార్లు కోరినప్పటికీ పట్టించుకోవడం లేదని పలువరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాన నానుతూ, ఎండకు ఎండుతూ నరకయాతన పడుతున్నామని భక్తులు వాపోతున్నారు. ముఖ్యంగా భక్తులు రోడ్డు పక్కన నిలబడడంతో జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదమూ ఉన్నది. ఇప్పటికైనా ఆలయ కమిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రెండు వైపులా బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఆయిల్ పామ్ తోటలను సందర్శించిన కేంద్ర బృందం



గజ్వేల్ : అక్కారంలో ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గజ్వేల్/చేర్యాల ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటలను కేంద్ర బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పొన్ను స్వామి, అడిషనల్ డైరెక్టర్ హర్టికల్చర్ సరోజిని దేవీలు గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం, బూర్గుపల్లి, కొమురవెల్లి మండలం గురువన్నపేటలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. వారికి జిల్లా హర్టికల్చర్ అధికారి సువర్ణ ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి సంతృప్తి కలిగిందన్నారు. జిల్లా అధికారి సువర్ణ మాట్లాడుతూ జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి 6,66,546 మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో 12,339 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుందని తెలిపారు. 329మంది రైతులు 322.83 టన్నుల దిగుబడి సాధించారని, రెండు ఆయిల్‌పామ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జూన్ మొదటి వారంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం టన్నుకు రూ.21వేలు ఉందని, రైతులు ముందుకు వచ్చి ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలని కోరారు. తక్కువ పరిధిలో చీడపీడల బాధ లేకుండా ప్రభుత్వ రాయితీతో డ్రిప్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. వారి వెంట ఉద్యానవన అధికారులు రమేశ్, కౌసల్య, బాలాజి, విజయకృష్ణ, ఆయిల్‌ఫెడ్ అధికారులు భాస్కర్‌రెడ్డి, శంకర్, ప్రవీణ్‌రెడ్డి తదితరులున్నారు.

ఉద్యోగుల కష్టాలకు అండగా సర్కారు

● సంగారెడ్డిలో టీఎన్‌జీవో భవనానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనుకూలంగా ఉందని టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో టీఎన్‌జీవో భవన నిర్మాణానికి బుధవారం ఆయన సంఘం ప్రధాన కార్యదర్శి ముజీబ్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిల విషయంలో కేంద్ర సంఘం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. స్థల కేటాయింపుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ భవన నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం టీఎన్‌జీవో సంఘానికి కేటాయించిన స్థల పత్రాలను అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, తహసీల్దార్ దేవీదాస్ సంఘం నేతలకు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వి.రవి, అసోసియేట్ అధ్యక్షులు శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన సేవలు అందించాలి

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెల వారి నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేపప్పుడు ఏ విధంగా చేయాలి..ఏ ఏ అంశాలు క్రోడికరించాలి తదితర అంశాలపై వివరించారు. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. అన్ని స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకత, ప్రోయాక్టివ్ పోలీసింగ్ విధుల నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ.. ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడుపుట వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డయల్ 100, సైబర్ క్రైం వినియోగంపై విద్యార్థులకు, ప్రజలకు, అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకట్‌రెడ్డి, సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, జిల్లా సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

● కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు

● కేఎస్‌పీపీలో పట్టాల ప్రదానోత్సవం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు

పటాన్‌చెరు రూరల్, ఏప్రియల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు అభిలషించారు. జాతీయంగా, ప్రపంచవ్యాప్తం ప్రజావిధాన రూపకల్పలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రతిష్టాత్మక కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్‌పీపీ) తృతీయ పట్టభద్రుల దినోత్సవాన్ని బుధవారం హైదరాబాద్ గీతం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. 'మీరు వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నప్పుడు, సమాజంలో అర్థవంతమైన మార్పును సృష్టించే జ్ఞానం, విలువలు, ఉద్దేశాన్ని మీతో తీసుకెళ్లండి' అని ఉద్బోధించారు. పౌర విమానయాన శాఖ మంత్రిగా తన పాత్రను వివరించారు. విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 160కి పెరగడం, స్థిరమైన రెండంకెల సీఏజీఆర్‌తో విమానయాన రంగం అద్భుతమైన వృద్ధిని సాధిస్తుందని పేర్కొన్నారు. గీతం అధ్యక్షులు, విశాఖపట్టణం పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీ భరత్ తన అధ్యక్షోపన్యాసంలో పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులను అభినందించారు. ముఖ్య అతిథి రామ్మోహన్ నాయుడును శ్రీభరత్ సత్కరించగా, కేఎస్‌పీపీ సహా వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్ సభకు పరిచయం చేశారు. ఈ ఏడాది 30 మంది విద్యార్థులకు పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను ప్రదానం చేశారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బంగారు పతకాలను ఇచ్చి సత్కరించారు. పలువురికి బంగారు పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేఎస్‌పీపీ డీన్, ఐక్యరాజ్య సమితిలో భారతదేశ పూర్వ శాశ్వత ప్రతినిధి ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్, గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న కేంద్రమంత్రి

గీతం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు తిరిగి వెళ్తుండగా సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న ముత్తంగి చర్చి ప్రాంతంలో మంత్రి వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో పైలెట్ వాహనంతో పాటు స్థానిక పోలీసు వాహనాలు కొద్ది కొద్దిగా ట్రాఫిక్‌ను క్లియర్ చేసుకుంటూ ముందుకు సాగాయి. ఎట్టకేలకు మంత్రి వాహనం ముత్తంగి రింగ్ రోడ్డు వరకు వచ్చి రింగ్ రోడ్డు పైనుంచి వెళ్లిపోయింది.



గ్రీన్ హైవేస్ కేటగిరిలో డీటీఎల్‌కు అవార్డు




కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా అవార్డును అందుకున్న టోల్‌వేస్ ప్రతినిధులు

మునిపల్లి, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్ హైవేస్ కేటగిరిలో డెక్కన్ టోల్‌వేస్ లిమిటెడ్ (డీటీఎల్)కు రజత అవార్డు దక్కింది. రహదారుల నిర్మాణం, నిర్వహణ ప్రక్రియలో వాటాదారులను గుర్తించి ప్రొత్సహించేందుకు కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ చేపట్టిన ఎన్‌హెచ్‌ఈఏ చొరవతో అవార్డు లభించగా, ఈ నెల 15న రోడ్డు రవాణా, రహదారుల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీటీఎల్ ప్రాజెక్టు హెడ్ రాజేష్ విచారే మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ, రాష్ట్రాలోని ఎన్‌హెచ్-65, మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు నుంచి తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి విభాగానికి రాయితీదారుగా డీటీఎల్ ప్రాజెక్టు ఉన్నదన్నారు. హైవేపై చేపడుతున్న పచ్చదనం, పునరుత్పాదక ఇంధన సృష్టి, పరిశుభ్రత, నీటి సేకరణ, మొక్కలు నాటడం, నీటి నిర్వహణ తదితర సౌకర్యాలు కల్పించినందుకు ఈ అవార్డు దక్కిందని తెలిపారు.

సిద్దిపేటలో అతిపెద్ద జైన విగ్రహం

● పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

● అరుదైన ప్రతిమను కాపాడుకోవాలని పిలుపు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అతి పెద్దదైన వర్ధమాన మహావీరుని శిల్పాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి సూచించారు. బుధవారం సిద్దిపేట జిలా నంగునూరులోని చిన్న కొండపైన నెలవైన జైన శిల్పాన్ని పరిశీలించారు. మహావీర శిల్పం, తలపై ఉష్ణీష చిహ్నంతో రాష్ట్రకూటుల కాలపు (క్రీ.శ. తొమ్మిదవ శతాబ్ది) జైన తీర్థంకర ప్రతిమాలక్షణానికి అద్దం పడుతుందని శివనాగి రెడ్డి చెప్పారు. నంగునూరు 11 వందల సంవత్సరాల నాటి జైన కేంద్రమని, అక్కడొక జైనబసది ఉండేదని పేర్కొన్నారు. తొమ్మిది అడుగుల ఎత్తు, మూడున్నర అడుగుల వెడల్పు ఉన్న ఈ అరుదైన అపురూప జైన విగ్రహం చుట్టూ గల రాతిని తొలగించడం మంచిది కాదని హెచ్చరించారు. ఇక మీదటైనా క్వారీ పనులను ఆపి, ఆ విగ్రహాన్ని కాపాడుకోవాలని నంగునూరు గ్రామ ప్రజలకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ క్షేత్ర పర్యటనలో అహోబిలం కరుణాకర్, పవన్, ప్రముఖ శిల్పి బి. సుధాకర్ సింగ్ పాల్గొన్నారు.

20 నుంచి ఓపెన్ పరీక్షలు

● మెదక్ డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో రాధాకిషన్ అధికారులకు సూచించారు. బుధవారం పరీక్షల నిర్వహణపై డీఈవో కార్యాలయంలో అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ పరీక్షలు ఈనెల 20 నుంచి 26 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగనున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 459 మంది, ఇంటర్ పరీక్షలకు 876 మంది అభ్యాసకులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పది పరీక్షల కోసం మెదక్, తూప్రాన్, నర్సాపూర్‌లో 3 కేంద్రాలు, ఇంటర్ కోసం మెదక్, నర్సాపూర్ 2 చొప్పున, తూప్రాన్‌లో ఒకటి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరగంట ముందుగాను చేరుకోవాలని, పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు మినహాయింపు ఉందన్నారు. అభ్యర్థి హాల్ టికెట్‌తోపాటు ఆధార్ కార్డు, లేదా ఫోటో స్పష్టంగా కనిపించే గుర్తింపు కార్డు తప్పని సరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు.

మత్స్య సొసైటీకి రక్షణ కల్పించండి : హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చేపల వేట సంబంధించి ఖాజీపూర్ ప్రాథమిక మత్స్య సహకార సంఘం సభ్యులకు పోలీసులు రక్షణ కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట్ భూంపల్లి మండలం ఖజీపూర్ పరిధిలోని పలు జలవనరుల్లో చేపలవేటకు జిల్లా మత్స్యశాఖ అధికారి తమకు హక్కులు కల్పించినప్పటికీ పలువురు అడ్డుకుంటున్నారని.. ఖాజీపూర్ మత్స్య సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ టీ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది డీఎల్ పాండు వాదిస్తూ.. 1964 నాటి జీవో 98 ప్రకారం 29 కులాలకు మాత్రమే ఫిషింగ్ హక్కులు ఉంటాయని తెలిపారు. ప్రధానంగా ముదిరాజ్, ముత్తరాశి, తెనుగు, బెస్త, గంగపుత్ర, గూండ్ల వర్గాలు ఉన్నాయన్నారు. ఖాజీపూర్ మత్స్యకారుల సొసైటీకి జిల్లా మత్స్యశాఖ అధికారులు అనుమతులు ఇచ్చినప్పటికీ అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేద న్నారు. ఈ నేపథ్యంలో తమ హక్కులను, జీవనోపాధిని కాపాడాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వం, పోలీసు, మత్స్యశాఖ అధికారులకు నోటీసులు జారీచేసింది. తగిన రక్షణ చర్యలు చేపట్టాలని దుబ్బాక సీఐ, భూంపల్లి ఎస్‌హెచ్‌వోకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ ఈనెల 29కి వాయిదా పడింది.

పీఎస్‌ను తనిఖీ చేసిన సంగారెడ్డి ఎస్పీ

ఝరాసంగం, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన ఝరాసంగంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లోని పరిసరాలను ఆయన పరిశీలించారు. అక్కడి రికార్డులను పరిశీలించి స్థానిక ఎస్ఐ నరేష్‌కు వాటిపై సలహాలు, సూచనలు అందజేశారు. శాంతి భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు.

నీరు లేకుండా జీవుల మనుగడ అసాధ్యం

● డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య

చిన్నకోడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నీరు లేకుండా జీవుల మనుగడ అసాధ్యమని డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య పేర్కొన్నారు. బుధవారం చౌడారం గ్రామంలో పలు శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి వాటర్ షెడ్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులలో ర్యాలీ చేసి, మొక్కలు నాటారు. చెక్‌డ్యాం నిర్మాణానికి భూమి పూజ, జ్యోతి ప్రజ్వలన చేసి, నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. జీవనోపాధుల కింద పలువురు నెలకొల్పిన యూనిట్ల ప్రదర్శన (స్టాల్స్)ను పరిశీలించారు. వాటర్ షెడ్ నిర్వహణకు సంబంధించిన వీడియోను ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. నీటి ప్రాముఖ్యం, పొదుపు, తోటల పెంపకం, వాటర్ షెడ్ పథక ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య మాట్లాడుతూ అందరూ నీటిని వాడే వాళ్లే కానీ, కాపాడేవాళ్లు చాలా అరుదుగా ఉంటారన్నారు. కందకాలు తవ్వడం, రాతి కట్టడాలు, చెక్ డ్యాం నిర్మాణంతో భూగర్భ జలాలను పెంచవచ్చునన్నారు. పిల్లలకు నీటిని సంరక్షించడం నేర్పించాలన్నారు. వాటర్ షెడ్ అభివృద్ధి పనులకు సహకరించిన 26 మందికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఏవో రాధిక, అడిషనల్ డీఆర్డీఏ పీడీ బాలకిషన్, ఏపీడీ శ్రీనివాస్, వాటర్ షెడ్ ప్రాజెక్టు అధికారి నూరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



చికిత్స పొందుతున్న విద్యార్థుల వివరాలు తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 16: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం అని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సమీకృత బాలికల వసతి గృహం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ జిల్లాలో అన్ని రకాల 105 వసతి గృహాలు ఉన్నాయన్నారు. నాలుగు రోజుల క్రితం విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. సంఘటన జరిగిన రోజునే ఫుడ్ శాంపిల్స్ సేకరించమన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే క్రమ శిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారిని పద్మజ, సీహెచ్‌వో (కమ్యూనిటీ హెల్త్ అధికారి) ఎలిజబేత్ రాణి, డాక్టర్ ఫెర్నాండాజ్ , అసుపత్రి సూపర్ వైజర్ రమేష్, వార్డెన్ నర్సమ్మ ఉన్నారు.

ఎర్లీ బర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎర్లీ బర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య పేర్కొన్నారు. ఎర్లీబర్డ్ స్కీంలో భాగంగా గజ్వేల్ పట్టణంలోని సెయింట్ మేరీస్ విద్యాసంస్థకు చెందిన రూ.1,67,430 చెక్కును కమిషనర్ గొల్కొండ నరసయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఇంటి పన్నులు 5శాతం రిబేట్ ఉన్నందున పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

చేర్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని చేర్యాల మాజీ వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సబ్బండవర్ణాలు సంతోషంగా జీవించారని, కాంగ్రెస్ పాలనలో అరిగోస పడుతున్నారన్నారు. బహిరంగసభకు ఇంటికొకరు చొప్పున కదలిరావాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కుకునూరుపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముద్దపూర్ గ్రామంలో పలువురు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందారు. వారికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు శ్రీకాంత్ రెడ్డి బుధవారం గ్రామానికి చెందిన పోగుల ధన అంజయ్య, శ్రీనివాస్, కొంతం రాజయ్యలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, మల్లం సురేష్, ఆదిరాములు, కొంతం బాల్‌నర్సు, రిప్పల అంజనేయులు, మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రిమ్మనగూడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సంగళ్ల రాజయ్య అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ గ్రామ అధ్యక్షుడు గుండారం నవీన్ బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి తన వంతుగా రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు బీఆర్ఎస్ మండల సమావేశం

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జగదేవ్‌పూర్ మండల కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పనగట్ల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం జగదేవ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవం బహిరంగ సభ విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. జగదేవ్‌పూర్‌లోని కేశిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశానికి జగదేవ్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చి ఈ సమావేశంను విజయవంతం చేయాలని కోరారు.

పేదలు పైలెట్ ప్రాజెక్టు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోహెడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరెడ్డిపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద 91ఇళ్లు మంజూరయ్యాయని, వీటిని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీవో శోభ సూచించారు. బుధవారం నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారుల ఇళ్లను వారు సందర్శించి మాట్లాడారు. గ్రామంలో 18 ఇళ్లను బేస్మెంట్ వరకు నిర్మించినట్టు తెలిపారు. మరో 40 ఇళ్లు ముగ్గులు పోసుకొని నిర్మాణాలకు సిద్ధం చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన్న ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణం చేపట్టాలని, ఈ పైలెట్ ప్రాజెక్టు అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద ధర్మయ్య, గ్రామ కార్యదర్శి జ్యోతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంద శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

వర్గల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆరోగ్యంపట్ల దృష్టి సారించాలని సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ నర్సింలు సూచించారు. బుధవారం మండలంలోని జెబ్బాపూర్ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 20 నిమిషాలు యోగసనాలు చేసినట్లయితే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. యోగాతో పాటు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీవోఏ యాదగిరితో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం

ధూళిమిట్ట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలపల్లి గ్రామంలో ఉపాధి హమీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణాన్ని బుధవారం మాజీ జడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జాలపల్లి గ్రామంలో మొత్తం రూ.74 లక్షలతో సీసీ రోడ్లు, అమ్మ అదర్శ కమిటీల ద్వారా పాఠశాల ప్రహరీ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. నిధులు మంజూరు చేయించిన ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి గ్రామస్థుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నమన్నారు.

పశువులకు అందని వైద్యం

- వారానికి ఒక్కసారి మాత్రమే ఆసుపత్రికి వెటర్నరీ డాక్టర్
- వెటర్నరీ అసిస్టెంట్ ఉన్నా.. లేనట్టే!
- బతిమాలిన రైతుల పట్ల దురుసు ప్రవర్తన
- రామవరం పశువైద్యశాలలో పశువులకు అందని వైద్యసేవలు




రామవరంలో ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యాధికారి చాంబర్, ఆసుపత్రిలో వైద్యం అందక నిరాశతో వెళ్తున్న రైతు

అక్కన్నపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు పాడి, పంట రెండు కళ్లలాంటివి. వ్యవసాయంలో తమకు చేదోడు వాదోడుగా ఉండే పశువులను రైతులు కంటికి రెప్పలా కాపాడుకుంటారు. అలాంటి పశువులకు వ్యాధులు సోకితే స్థానికంగా చికిత్స చేసే నాథుడే కరువయ్యాడని మండలంలోని రామవరం గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసినా పశువులకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని ఆందోళనకు గురవుతున్నారు.

ఒక రోజు డ్యూటీ.. వారం రోజుల హాజరు?

మండలంలోని రామవరంలో ఉన్న పశు వైద్యశాలలో వెటర్నరీ డాక్టర్ సుకన్య వారం రోజుల నుంచి విధులకు రాకపోవడంతో పాడి పశువులకు వైద్యం అందడం లేదు. వైద్యం కోసం పశువులను తీసుకువచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం పశు వైద్యశాలకు రైతులు పశువులను తీసుకురాగా విధులు నిర్వహిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ లాలు అనారోగ్యంతో ఉండడంతో పశువులకు వైద్యం చేయకపోవడంతో నిరాశతో వెనక్కి వెళ్లారు. పశువుల వైద్యం కోసం గోపాలమిత్ర, ప్రైవేట్ వెటర్నరీలను రైతులు ఆశ్రయిస్తున్న పరిస్థితి నెలకొంటున్నది. దీంతో పశువైద్యం ఆర్థిక భారమైందని పలువురు వాపోతున్నారు. రెగ్యులర్‌గా పశు వైద్యశాలకు హాజరు కావలసిన వెటర్నరీ డాక్టర్ వారానికి ఒకసారి మాత్రమే వస్తున్నారని, అలా వచ్చినప్పుడే రిజిస్టర్‌లో సంతకాలు చేసుకొని వెళ్లిపోతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

వెటర్నరీ అసిస్టెంట్‌కు అనారోగ్యం..

రామవరం పశువుల ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ అనారోగ్యంతో బాధపడుతూ తన కుమారుడి సహాయంతో ఆసుపత్రికి వస్తున్నాడని రైతులు చెబుతున్నారు. పశువులను తీసుకుని ఆసుపత్రికి వస్తే తన ఆరోగ్యం సహకరించడం లేదని వైద్యం అందించేందుకు నిరాకరిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. బతిమాలి అయినా వైద్యం చేయించుకుందామని యత్నిస్తే వెటర్నరీ అసిస్టెంట్ కుమారుడు జగదీశ్వర్ వైద్యశాలకు వచ్చిన రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని వాపోతున్నారు.

మూగజీవులకు వైద్యం అందక చనిపోతే బాధ్యులు ఎవరని రైతులు ఆక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. ఇప్పటికైనా జిల్లా పశు వైద్య శాఖ అధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న పశు వైద్యాధికారిపై చర్యలు తీసుకొని, పశువులకు వైద్యం అందేలా తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై పశు వైద్యాధికారి సుకన్యను ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

రాజకీయ కక్ష సాధిస్తున్న మోదీ ప్రభుత్వం



సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద మోదీ ఫ్లెక్సీతో కాంగ్రెస్ నాయకుల నిరసన

సిద్దిపేట/గజ్వేల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సోనియా, రాహుల్‌గాంధీలపై ఈడీ కోర్టులో చార్జిషీట్ నమోదు చేయడానికి నిరసిస్తూ బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మోదీ విధానాలను దుయ్యబడుతూ ఫ్లెక్సీలు, దిష్టిబొమ్మలను దహనం చేశారు. సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్‌పార్టీ పట్టణ నాయకులు మోదీ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకుడు బొమ్మల యాదగిరి మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్నామన్న అహంకారంతో కాంగ్రెస్ అగ్రనేతలపై మోదీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు త్వరలో వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పయ్యావుల ఎల్లం, రియాజుద్దీన్, నాయకులు ముద్దం లక్ష్మి, గ్యదారి మధు, దాస అంజయ్య, మార్క సతీష్‌గౌడ్, ఫుల్లూరు సంతోషి, రాషద్, గయాజుద్దీన్, వహాబ్, అనిల్, కవిత, మున్నా, అర్షద్, అజ్మత్, రేణుక, రజిని, సన, కనకయ్య, షాదుల్లా, కనకరాజు, రాజిరెడ్డి, హబీబ్ ఖాన్, బాలయ్య, ఎండి అజ్మత్, సికిందర్, బీజని తదితరులు పాల్గొన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల పేర్లను నమోదు చేయడాన్ని ఖండిస్తూ గజ్వేల్‌లోని ఆర్డీవో కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంక్షారెడ్డి మాట్లాడుతూ.. ఈడీ, సీబీఐ ముసుగులో ప్రతిపక్షాలపై మోదీ ప్రతీకార చర్యలు సరికావన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అక్రమంగా ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడంపై వారు మండిపడ్డారు. కార్యక్రమంలో సమీర్, జంగం రమేశ్‌గౌడ్, శివారెడ్డి, షాహెద్, గుంటుకు శ్రీనివాస్, జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా, తదితరులున్నారు.

దళాలను నమ్మి మోసపోవద్దు



తొగుట: ఘనపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తొగుట/కుకునూరుపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి); రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకుని లబ్ధి పొందాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కం స్వామి పేర్కొన్నారు. బుధవారం తొగుట మండల పరిధిలోని ఘనపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి మాధవి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మ్యాదరి స్వామి, వెలుగు సీఎలు రాజశేఖర్, మమత, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కుకునూరుపల్లి మండలంలోని కుకునూరుపల్లి, మంగోల్, లకుదారం తదితర గ్రామాల్లో బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గరపడ్డాయి

మిరుదొడ్డి,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వాన్ని రానున్న రోజుల్లో గద్దెదించాలని, లేనిపక్షంలో రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామిగౌడ్ పేర్కొన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి, మాధన్నపేట గ్రామాల్లో జైబాపు, జైబీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులతో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు గుండాశంకర్, నాయకులు భూమయ్య, నర్సింహారెడ్డి, బాలాగౌడ్, సుమలత, రాములు తదితరులున్నారు.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రభుత్వం

తొగుట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తొగుటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో అన్నిరంగాలు అధోగతి పట్టాయన్నారు.

మా వాటా ప్రకారం నిధులు ఇవ్వాల్సిందే



జాలపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ధూళిమిట్ట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గం తెలంగాణలోనే ఉందని, మా వాటా ప్రకారం మాకు నిధులు ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. లింగాపూర్, జాలపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందినవారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం జాలపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తోర్నాల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేసి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు తుజాలపురం బాలయ్యను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అనంతరం గ్రామంలో సీసీ రోడ్ల పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిధులను అవసరమైతే కొట్లాడి తెస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఏంపీపీ బద్దిపడగ క్రిష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి. మండల అధ్యక్షుడు మంద యాదగిరి, నాయకులు ఉన్నారు.

అమృత్ 2.0 ఇక జీరోయేనా..!

(5వ పేజీ తరువాయి)

కానీ నత్తనడకన కొనసాగుతుండటం, రేగడి స్థలం కావడంతో రానున్న రోజుల్లో వర్షాలు కురిస్తే పనులకు ఆటంకం తలెత్తనున్నాయి. రెండు ట్యాంకులకు స్థలం అందుబాటులో లేక, ఉన్నస్థలంలో చేపట్టిన ఒక్క ట్యాంక్‌పనులైనా సక్రమంగా చేపట్టకపోతుండటంతో ఊసూరుమంటున్నారు.

అధికారుల నుంచి స్పందన లేదు

వాటర్ ట్యాంకుల నిర్మాణానికి స్థలం బదలాయించాలని ఆర్టీసీ, వ్యవసాయ మార్కెట్ అధికారులను కోరాం. అయినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందనలేదు. అంబేడ్కర్ భవన్ వద్ద ఒక ట్యాంక్ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుత మునిసిపల్ కార్యాలయ సమీపంలోని ప్రకృతివనం స్థలంలో మరోట్యాంక్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్నాం. ఆర్టీసీ బస్టాండు వద్ద చేపట్టాల్సిన ట్యాంక్‌ను ఎక్కడ చేపట్టాలన్నది ఆలోచిస్తున్నాం.

- చేర్యాల, మునిసిపల్ కమిషనర్ నాగేందర్

యువ వికాసం

(5వ పేజీ తరువాయి)

అధికారులు పరిశీలించనున్నారు. పరిశీలన తరువాత జూన్ 2న అధికారికంగా లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందించనున్నారు. అందుకు గాను అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు కమిటీని నియమించింది. కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, పీడీ డీఆర్‌డీఏ కన్వీనర్‌గా, అడిషనల్ కలెక్టర్, ఇండ్రస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ జనరల్ మేనేజర్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు, మైనార్టీ వెల్ఫేర్ అధికారి, డిజేబిల్డ్ వెల్ఫేర్ ఏడీ, డబ్ల్యు అండ్ సీడీ పీడీ, ట్రైబల్ వెల్ఫేర్ డీటీడీవో, లీడ్ జిల్లా మేనేజర్‌లు సభ్యులుగా ఉండనున్నారు. వీరి ఆధ్వర్యంలోనే అర్హుల ఎంపిక జరగనున్నది.

ఈ నెల 19లోగా సమస్యలు పరిష్కరించాలి



ఎంపీవోకు సమ్మెనోటీసు ఇస్తున్న కార్మికులు

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి); గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యలను ఈ నెల 19వ తేదీ లోపు పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నారాయణరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో శ్రీనివాస్‌రావుకు కార్మికులు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు కనీస వేతనాలు గాని, ఉద్యోగ భద్రత లేదన్నారు. నైపుణ్యం కార్మికులతో లేని పనులు చేయించడం వల్ల 200 మంది చనిపోయారని, వారికి ఇన్సూరెన్స్ సైతం లేక వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. సమస్యలను పరిష్కరించలేని పక్షంలో ఏప్రిల్ 19 తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కారోబార్లు రాజలింగం, దాసరి సంతోష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం

- పలు మండలాల్లో పోషణ్ పక్వాడ



గజ్వేల్‌లోని వేములఘాట్‌లో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి



ధూళిమిట్ట రైతువేదికలో చిన్నారులతో అక్షరభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు

గజ్వేల్ రూరల్/ధూళిమిట్ట/మద్దూరు/మిరుదొడ్డి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు, గర్భిణులు అందుబాటులో ఉండే పోషక విలువలతో కూడిన ఆకుకూరలు, చిరుధాన్యాలు, పండ్లు తీసుకోవాలని అవగాహన కల్పించారు. గజ్వేల్ పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీ వేములఘాట్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి పౌష్టికాహారం, చిరుధాన్యాలపై తల్లులకు వివరిసూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ధూళిమిట్ట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన బైరాన్‌పల్లి సెక్టార్‌స్థాయి పోషణ పక్వాడ కార్యక్రమానికి ఏంపీడీవో వీరరాజు ముఖ్య అతిథిగా హాజరై పౌష్టికాహారం, పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. సీడీపీవో రమాదేవి పిల్లల ఎదుగుదల గురించి వివరిస్తూ అంగన్‌వాడీల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం పిల్లలకు అక్షరభ్యాసం చేయించారు. మద్దూరు మండలంలోని రేబర్తి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పోషకాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత అవగాహన కల్పించారు. దుబ్బాక లోని ప్రాజెక్ట్ పరిధిలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన పర్వయ్య

చేర్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణ శివారు కోర్టు ఆవరణలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది పర్వయ్యకు తీవ్రగాయాలయ్యాయి. మద్దూరు మండలం లద్నూరు గ్రామం నుంచి చేర్యాలకు బైక్‌పై వస్తుండగా, కోర్టు ఆవరణలో జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన స్టాపర్‌ను ఢీకొని బైక్ అదుపు తప్పింది. దీంతో తీవ్రగాయాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సిద్దిపేటకు తీసుకువెళ్లారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే చర్యలు

చేర్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని చేర్యాల ఎస్ఐ నీరేశ్ పేర్కొన్నారు. చేర్యాల పట్టణ శివారులో బుధవారం పెట్రోలింగ్ చేపట్టి బ్రీత్ అనలైజర్‌తో డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ట్రిబుల్ రైడింగ్ చేయకూడదని, ప్రతీవాహనదారుడు హెల్మెట్ ధరించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు.

ఏఐ బోధనతో విద్యార్థులకు మేలు: డీఈవో



రామంచ పాఠశాలలో ఏఐ బోధనను పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థుల స్థాయి పెంపునకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) బోధన ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రామంచ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు చేస్తున్న ఏఐ టూల్స్, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని, పాఠశాలల రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని, మొక్కల సంరక్షణ తీరును పరిశీలించారు. యూడైస్ క్రాస్ చెక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు సంబంధించిన అసైన్‌మెంట్లు ప్రాక్టీసు చేయించారు. కార్యక్రమంలో ఏంఈవో యాదవరెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్తవ్వ అబ్దుల్లా షరీఫ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పండరి ఏకగ్రీవం



పండరిని సన్మానిస్తున్న గజ్వేల్ కోర్టు జడ్జి ప్రియాంక

మర్కుక్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది చెన్ రాజు పండరి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రెండోసారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నరేష్‌చారి, ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్, సంయుక్త కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా ప్రశాంత్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా మహమ్మద్ అబ్దుల్ గఫర్, సీహెచ్ అశోక్, అరవింద్‌రెడ్డి, అంజలి, అధికార ప్రతినిధిగా వల్లంకొండ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

పోతిరెడ్డిపల్లిలో పోలీసుల కనువిప్పు

చేర్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కళాబృందం బెట్టింగ్, సోషల్‌మీడియా, సైబర్ నేరాలు, మోసాలు తదితర అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐ ఎల్. శ్రీను మాట్లాడుతూ బెట్టింగ్‌లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోకూడదని, ఆన్‌లైన్ గేమ్స్ ఆడి కుటుంబాలను రోడ్డునపడేయకూడదని సూచించారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలు, మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నీరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



మోతెలో ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజమేనని, చేసిన సేవలే గుర్తింపును ఇస్తాయని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సాంఘిక ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అశోక్‌గౌడ్ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అక్బర్‌పేట-భూంపల్లి, దుబ్బాక ఎంఈవోలు అంజయ్య, ప్రభుదాస్, మాజీ సర్పంచు కాలేరు శ్రీనివాస్, నాయకులు రాజేశ్వర్, రంజిత్, చంద్రం, బాల్‌నర్సాగౌడ్, రమేష్ ఉన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు సరికాదు

ముబారస్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి నీలి జెండాను కిందపడేశారని ఆరోపించడం సరికాదని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. జెండాను కిందకు ఇవ్వాలని ఓ యువకుడు అడగడం వల్లే జెండాను ఇచ్చారని తెలిపారు. ఆ యువకుడు చేతిలో నుంచి జారిపడిపోయిందని వెల్లడించారు. ఒకవేళ ఎమ్మెల్యే జెండాను కింద పడేస్తే తనతోపాటు దళితసంఘాల నాయకులు ఖండించేవాళ్లమని తేల్చిచెప్పారు.

ఎమ్మెల్యే జెండాను క్యాచ్ వేస్తే మేమే పట్టుకున్నాం

దౌల్తాబాద్,ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముబారస్‌పూర్‌లో ఈ నెల 13 న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సమయంలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి చేతిలో ఉన్న జెండాను అదే గ్రామానికి చెందిన చింతకింది కరుణాకర్‌కు క్యాచ్ వేస్తే పట్టుకున్నాడని గ్రామ మాజీ సర్పంచ్ యాదగిరి, కుమార్, కిరణ్ వివరించారు. బుధవారం ముబారస్‌పూర్ అంబేడ్కర్ చౌరస్తాలో వారు మాట్లాడుతూ.. విగ్రహావిష్కరణను జీర్ణించుకోలేని కొందరు ఇతర నాయకులతో కుమ్మక్కై దుబ్బాక ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నవారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరి,చింతకింది కరుణాకర్,స్వామి,కోటి కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మెడిసిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌తో కలసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు సాహితి, అనిమిషా, అమూల్య, రిషిత, హర్ష, సంతోష్, దీక్షిత, అఖిలేష్, డేనియేల్, నవ్య, డింపుల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మైనారిటీ విభాగం రాష్ట్ర నాయకులు సమీర్, పట్టణ అధ్యక్షుడు మోహన్నగారి రాజు తదితరులున్నారు.